

ఏపిలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం

5

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -314 మంగళవారం17 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రైజింగ్ తెలంగాణకి

# రోడ్ మ్యాప్





- ప్రపంచానికే ఆదర్శంగా తెలంగాణను నిర్మిస్తాం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- సమ్మిళిత వృద్ధి సాధించేందుకు ముందుకు సాగుతాం
- 67,763 ఉద్యోగాల భర్తీ
- ప్రభుత్వోద్యోగులు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా
- ప్రతిపక్ష నేత కేసీఆర్ గైర్హాజరు
- వందేమాతరం గీతాలాపన సమయంలో ఎంఐఎం వాకౌట్
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు షురూ

**హైదరాబాద్ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి స్పష్టమైన రూట్‌మ్యాప్‌తో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణను నిర్మిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహరహం కృషి చేస్తున్నామన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా



ప్రసంగించారు. ప్రారంభంతో పాటు ముగింపు లోనూ తెలుగులో ఆయన మాట్లాడారు. ప్రసంగం మధ్యలో కొన్నిసార్లు తడబడ్డారు.


తెలుగు, హిందీ, ఇంగ్లీష్ త్రిభాషలో ఆయన ప్రసంగం సాగింది. కొన్ని పదాలను స్పష్టంగా పలకకపోవడంతో సభ్యులకు అర్థంకాక కొంత ఇబ్బంది పడ్డారు. ప్రస్తుత బడ్జెట్ కేవలం ఆర్థిక కేటాయింపుల గురించి మాత్రమే కాకుండా, బలమైన, స్థిరమైన రాష్ట్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి పథకం, విధానం, కార్యాచరణలో ప్రజల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక సమానత్వం పాటించడమే ప్రజాపాలనకు**మిగతా 2లో...**

# ట్రంప్‌కు షాక్

- హార్ముజ్‌కు రక్షణ నౌకలను పంపబోమన్న మిత్రదేశాలు
- కాల్పుల విరమణను కోరలేదు -ఎన్నిరోజులైనా పోరాడుతాం: ఇరాన్
- దుబాయి ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ డ్రోన్ దాడి
- ఇజ్రాయిల్ నగరాలు, గల్ఫ్‌పై టెహ్రాన్ దాడులు ముమ్మరం
- జనావాసాలపై అమెరికా ఇజ్రాయిల్ దళాల బాంబుల వర్షం

**మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** దాడులు, ప్రతి దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడికిపోతోంది. యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించినా ఇజ్రాయిల్–అమెరికా సేనలు కానీ, ఇరాన్ దళాలు కానీ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ డ్రోన్ దాడిలో దుబాయ్ విమానాశ్రయం సమీపంలో సోమవారం మంటలు చెలరేగాయి. విమానాశ్రయం సమీపంలో ఉన్న ఇంధన ట్యాంకుపై డ్రోన్ పడడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో అత్యవసర బృందాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. ముందు జాగ్రత్త చర్యగా విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.

**మిగతా 2లో...**







# 100 శాతం స్టాక్

- దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం ప్రకటన
- అన్ని రాష్ట్రాలలో ఎల్పీజీ స్టాక్ ఉందన్న కేంద్ర ప్రభుత్వం
- గృహ వినియోగదారుల కోసం 100 శాతం స్టాక్ ఉందన్న కేంద్రం
- హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలు క్షేమంగా ఉన్నాయని వెల్లడి
- ఎల్పీజీ క్యారియర్ నౌక శివాలిక్ సాయంత్రం భారత్ చేరుకుంటుందని వెల్లడి

2లో.



2లో.

## బెంగాల్ పాలనాయంత్రాంగంపై

# ఈసీ పూర్తి పట్టు

- యాక్టింగ్ డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌పై ఈసీ వేటు
- కొత్త డీజీపీగా సిద్ధ్ నాథ్ గుప్తా, కమిషనర్‌గా అజయ్ కుమార్ నంద్ నియామకం
- ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీల బదిలీల తర్వాత పోలీసు శాఖలో ప్రక్షాళన
- శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికల కోసమే ఈ చర్యలని వెల్లడి
- ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్‌లో రెండు దశల పోలింగ్

## ఆరు గ్యారెంటీలపై

# అసెంబ్లీలో నిలదీస్తాం

గన్‌పార్క్ వద్ద అమరులకు కెటిఆర్ తదితరుల నివాళి



2లో.

# ఆస్కార్ ఉత్తమ చిత్రం 'ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'

ఉత్తమ నటుడు : మైఖేల్ బి జోర్డాన్, ఉత్తమ నటి : జెస్సీ బక్లీ, ఉత్తమ దర్శకుడు : పాల్ థామస్ అండర్సన్



**లాస్ ఏంజెల్స్ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యావత్ సినీ ప్రపంచం ఎంతో ఆస్తకిగా ఎదురు చూసిన ఈ ఆస్కార్ అవార్డుల్లో 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితోపాటు మరో 4 అవార్డులను దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించింది.'సిన్నర్స్' చిత్రంలోని నటనకు గాను ఉత్తమ నటుడిగా మైఖేల్ బి జోర్డాన్, 'హామ్నెట్' చిత్రంలోని నటనకు గాను జెస్సీ బక్లీ ఉత్తమ నటిగా**మిగతా 2లో...**

## అమరజీవి త్యాగం

# నేటి తరానికి స్ఫూర్తి

అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ

- పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర
- స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం
- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- అమరావతిలో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు
- తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం
- అమరజీవి పొట్టి శ్రీరాములు
- నివాళి అర్పించిన డిప్యూటీ సిఎం పవన్



2లో.

# సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...

- తెలంగాణ కవి సిధారెడ్డికి జాతీయ పురస్కారం
- 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి దక్కిన గౌరవం
- కరోనా సమయంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను చూపించారని కేసీఆర్ ప్రశంస



2లో.

# 100 శాతం స్టాక్

## దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం ప్రకటన

**మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది.
పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నేడు సాయంత్రం 5 గంటలకు ఈ క్యారియర్ భారత్ చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.
పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.ద

## బెంగాల్ పాలనాయంత్రాంగంపై ఈసీ పూర్తి పట్టు

**మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛాయుత, శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీలను బదిలీ చేసిన మరుసటి రోజే, పోలీసు శాఖలోనూ భారీ మార్పులు చేసింది. రాష్ట్ర యాక్టింగ్ డీజీపీ పీయూష్ పాండే, కోల్‌కతా పోలీస్ కమిషనర్ సుప్రతిమ్ సర్కార్‌లను తక్షణమే ఆ పదవుల నుంచి తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.నూతన డీజీపీగా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిద్ధ్ నాథ్ గుప్తాను, కోల్‌కతా నూతన పోలీస్ కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అజయ్ కుమార్ నంద్‌ను ఈసీ నియమించింది. వీరితో పాటు లా అండ్ ఆర్డర్ డీజీగా ఉన్న వినీత్ కుమార్ గోయల్‌ను కూడా తొలగించి, ఆయన స్థానంలో 1995 బ్యాచ్ అధికారి అజయ్ ముకుద్ రానడేను అదనపు డీజీగా (లా అండ్ ఆర్డర్) నియమించారు. మరోవైపు, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నటరాజన్ రమేశ్ బాబును డైరెక్టర్ జనరల్ ఆఫ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా పోస్టింగ్ ఇచ్చారు.బెంగాల్‌లో ఎన్నికలను హింసారహితంగా నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం జనవరి 30న నియమితులైన పాండే, సర్కార్‌లను రెండు నెలలు కూడా గడవకముందే మార్చడం గమనార్హం. ఆదివారం రాత్రి చీఫ్ సెక్రటరీ నందినీ చక్రవర్తి, హోం సెక్రటరీ జగదీశ్ ప్రసాద్ మీనాలను కూడా ఈసీ బదిలీ చేసి, వారి స్థానంలో దుష్యంత్ నరియాల, సంఘమిత్ర ఘోష్‌లను నియమించింది.కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

# హోర్ముజ్‌కు రక్షణ నౌకలను పంపబోమన్న మిత్రదేశాలు

మొదటిపేజీ తరువాయి
కొన్ని విమానాలను దుబాయి ఎయిర్‌పోర్టు నుంచి అల్ మక్టమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దారి మళ్లించారు. దుబాయి పౌర రక్షణ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. డ్రోన్ దాడి నేపథ్యంలో విమానాశ్రయ రోడ్డును, ఎయిర్‌పోర్ట్ టన్నెల్‌ను పోలీసులు మూసివేశారు. విమానాశ్రయ పరిసరాలపై డ్రోన్ దాడి జరగడం ఇది మొదటిసారి కాదని అధికారులు తెలిపారు.

**యూఏఈ చమురు వాణిజ్య హబ్‌పై**
దుబాయి విమానాశ్రయం ప్రాంతంలో దాడి జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఫుజైరా చమురు వాణిజ్య హబ్‌పై కూడా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ మంటలను అదుపు చేసేందుకు సహాయ సిబ్బంది ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. ఘటన తర్వాత చమురు లోడింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రపంచంలో ముడి చమురును, ఇంధనాలను నిల్వ చేసే అతి పెద్ద కేంద్రాలలో ఫుజైరా ఒకటి. ఇది యూఏఈకి చెందిన అబూధాబీ ముడి చమురు పైప్‌లైన్‌కు చివరన ఉంది.
హర్మూజ్ జలసంధి ద్వారా కాకుండా ఇక్కడి నుంచి యూఏఈ ముడి చమురు సరఫరా అవుతుంటుంది. ఈ పైప్‌లైన్ ద్వారా రోజుకు ఒకటిన్నర మిలియన్ బ్యారల్స్ చమురును పంపవచ్చు. ఫుజైరా టెర్మినల్‌పై శనివారం కూడా దాడి జరిగింది. మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి యూఏఈపై ఇరాన్ 1,800కు పైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా ఆస్తులతో పాటు విమానాశ్రయాలు, ఓడరేవులు, చమురు కేంద్రాలు సహా పలు పౌర ప్రదేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.



**ఇరాన్‌పై బాంబుల వర్షం**
మరోవైపు అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. టెహ్రాన్, హమద్, ఇస్ఫహాన్, షిరాజ్, తబ్రిజ్ సహా పలు నగరాలు, పట్టణాలపై దాడులు జరుగుతున్నాయి. సెంట్రల్ టెహ్రాన్‌లో బాంబు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేశారు. ఇరాన్‌లో వరుసగా 17వ రోజు కూడా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. కాగా హెజ్బొల్లా దళాలను లక్ష్యంగా చేసుకొని దక్షిణ లెబనాన్‌లోని జబల్ అల్-బటమ్‌పై వైమానిక దాడులు జరిగాయి.
హెజ్బొల్లాపై పరిమిత స్థాయిలో భూతల దాడులు కూడా ప్రారంభించామని ఇజ్రాయిల్ తెలిపింది. రాజధాని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఆదివారం రాత్రి విమాన దాడులు జరిగాయి. లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో ఇప్పటి వరకూ వంద మంది చిన్నారులు సహా 850 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని డ్రోన్ తయారీ కర్మాగారాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నామని, దీంతో ఆ దేశం యొక్క తయారీ సామర్థ్యం దెబ్బతిన్నదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. యుద్ధం మొదటి రోజు మరణించిన ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీ ఉపయోగించిన విమానాన్ని ధ్వంసం చేశామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది.
ఇరాన్‌లో ప్రధాన పారిశ్రామిక, రవాణా కేంద్రంగా కొనసాగుతున్న ఛాబహార్ స్వేచ్ఛా వాణిజ్య మండలి సమీపంలోని సైనిక కేంద్రాలపై అమెరికా దళాలు వైమానిక దాడులు చేశాయి.

**హోర్ముజ్ రక్షణకు ట్రంప్ పిలుపు..**
**వస్తామంటూ చైనా షరతు**
ఇరాన్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హోర్ముజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు ముందుకురావాలని ట్రంప్ పలు దేశాలను కోరారు. ఈ విషయంపై చైనా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. హోర్ముజ్ రక్షణకు తాము ముందుకురావాలంటే.. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయన్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లిన్ జియాన్ అమెరికాకు సూచించారు.
ప్రస్తుత ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈనెల చివర్లో ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నా యన్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచు కోవడంలో ఈ పర్యటన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. హోర్ముజ్ ప్రాంతంలో చైనా ప్రయోజనాలే ఎక్కువని వ్యాఖ్యానిం చారు. ఆ జలసంధిని రక్షించేందుకు ముందుకురావాలని బీజింగ్‌కు పిలు పునిచ్చారు. ఆ దేశం ఇచ్చే సమాధానాన్ని బట్టి బీజింగ్ పర్యటనకు వెళ్లాలా, వాయిదా వేయాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

# రైజింగ్ తెలంగాణకి రోడ్ మ్యాప్

మొదటిపేజీ తరువాయి
గీటురాయిగా పాలనలో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తున్నామన్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించామని తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లు కాగా, 10.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని అన్నారు.
దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతమనీ, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందని వివరించారు. ద్రవోల్బణాన్ని 0.2 శాతానికి నియంత్రించామనీ, రాష్ట్రంలో ధరల స్థిరత్వం కొనసాగిందని చెప్పారు. నీటి పారుదల సదుపాయాలు మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకత పెంచామనీ, అన్నదాతలకు పెట్టుబడి సాయం అందిస్తూ, అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడంచెల వికేంద్రీకృత వ్యూహాన్నీ అనుసరిస్తున్నామన్నారు. 2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందనీ, దానిలో భాగంగానే జీహెచ్ఎంసీని సైబరాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించామన్నారు.
కొత్తగా తెస్తున్న క్యూర్ చట్టంతో హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు,హైడ్రాను ఒకటే పాలనా పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, కొత్తగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని అన్నారు. కాలుష్యం నుంచి తప్పించేందుకు హిల్ట్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకుపైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన చెరువు భూములు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్యలో 360 కిలోమీటర్ల ప్యూర్ (పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ) ప్రాంతాన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామనీ, ఇక్కడ పలు రకాల పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు.

ఈ పథకాన్ని మొత్తం రూ.22,500 కోట్ల అంచనా వ్యయమవుతుందనీ, ఇప్పటివరకు 3,24,536 ఇండ్లు మంజూరు చేయగా 2,62,449 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయనీ, వీటికోసం ఇప్పటివరకు రూ.5,073.84 కోట్లు విడుదల చేశామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.9,222 కోట్ల లబ్ది చేకూర్చామనీ, రూ.500కే ఎల్పీజీ సబ్సిడీ సిలిండర్లు ఇస్తున్నామనీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం రూ.3,900 కోట్లు ఖర్చు చేశామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 212 శాతం పెంచామని చెప్పారు. పాఠశాలల్లో రూ.706 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల పనులు చేపట్టామనీ, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తున్నదని చెప్పారు.
వీటిలో 60 స్కూళ్ల నిర్మాణం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చిందన్నారు. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,903.44 కోట్లు సాయం తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని వివరించారు. మంచిరేవుల గ్రామంలో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను స్థాపించామన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మాతృమరణాల నిష్పత్తిని ఆరు కంటే తక్కువ, శిశు మరణాల నిష్పత్తిని ఏడు కంటే తక్కువ తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని గవర్నర్ అన్నారు.
వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్), నిమ్స్ విస్తరణ, కొత్తగా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను చేపట్టామని వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి వీటి సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక', ప్రజావాణి, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ వంటి పలు అంశాలను గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, డ్రగ్స్ నివారణకు ఈగల్ ఏర్పాటు వంటి విషయాలు ప్రస్తావించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 67,763 పోస్టులను భర్తీ చేసిందనీ, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా నగదు రహిత ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు, సమ్మక్క సారలమ్మ జాతర, గద్దెల పునర్నిర్మాణం, ఎకో టెంపుల్ టూరిజం వంటి అనేక అంశాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

**కేసీఆర్ గైర్హాజరు**
ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు గైర్హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగ సమయంలో ఆయన ప్రధాన ప్రతిపక్షనేత స్థానం ఖాళీగా కనిపించింది. కొత్త గవర్నర్ బాధ్యతలు చేపట్టాక, తొలిసారిగా జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరు కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎంఐఎం వాకౌట్**
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సూచికగా తొలుత రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ గేయం వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరం గీతాన్ని ఆలపించడంపై ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.

# ఆస్కార్ ఉత్తమ చిత్రం 'ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'

మొదటిపేజీ తరువాయి
ఆస్కార్ అవార్డులను అందుకున్నారు.ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ పురసారాన్ని బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా అందజేశారు. కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణను ప్రేక్షకులు, విమర్శకులే కాదు ఆస్కార్ జ్యూరీ సైతం ఫిదా అవుతుందని 'ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమా నిరూపించింది. యావత్ ప్రపంచం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల్లో 13 విభాగాల్లో పోటీ పడిన ఈ సినిమా ఏకంగా 6 అవార్డులను గెల్చుకుని విజయకేతనాన్ని ఎగురవేసింది. తండ్రీ కొడుకుల అనుబంధం, భావోద్వేగాల నేపథ్యంలో బిడ్డ నమ్మకాన్ని గెలుచుకోవడం కోసం ఓ తండ్రి చేసిన పోరాటమే ఈ సినిమా. బ్లాక్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు.


**ఉత్తమ చిత్రం : ఒన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్**
'ఇన్ మెమరియ్' సెగ్మెంట్‌లో హాలీవుడ్ ప్రముఖులతోపాటు మన భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్‌కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దగ్గజాలకు ఆస్కార్ ఘన నివాళి అర్పిస్తూ ఓ వీడియోను ఆస్కార్ పురస్కార ప్రదానోత్సవంలో ప్రదర్శించారు.

# సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...

## తెలంగాణ కవి సిధారెడ్డికి జాతీయ పురస్కారం

## 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి దక్కిన గౌరవం

**హైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
ప్రముఖ కవి, విమర్శకుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డిని అత్యున్నత 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - 2025' వరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించిన వార్షిక పురస్కారాల్లో తెలుగు విభాగంలో ఆయన రాసిన 'అనిమేష' అనే దీర్ఘ కవితా సంపుటికి ఈ గౌరవం దక్కింది.ఈ సందర్భంగా సిధారెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, మట్టి వాసనను తన సాహిత్యంలో అక్షరబద్ధం చేసిన అరుదైన కవి సిధారెడ్డి అని కొనియాడారు. ముఖ్యంగా కరోనా సంక్షోభం సమయంలో మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులను 'అనిమేష' ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారని ఆయన ప్రశంసించారు. కేటీఆర్, హరీశ్ రావు, దేశపతి శ్రీనివాస్ వంటి ప్రముఖులు కూడా నందిని సిధారెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపారు.




# ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం

## గన్‌పార్క్ వద్ద అమరులకు కెటిఆర్ తదితరుల నివాళి

**హైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.



# అమరజీవి త్యాగం నేటి తరానికి స్ఫూర్తి

**అమరావతిహైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు,
ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు.
గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న సర్పంచ్ ప్రవీణ్ నాయక్.




**బయ్యారం/మార్చి 16.(జర్నలిస్ట్ వార్త);**రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కొత్త పేట గ్రామపంచాయతి మజీద్ లో సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే విధంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని బిస్మిల్లా ట్రేడర్స్ అధినేత ఇస్మాయిల్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..రంజాన్ పర్వదినం సోదరభావం,ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడం సమాజానికి శాంతి,అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన బిస్మిల్లా ట్రేడర్స్ అధినేత ఇస్మాయిల్ ని సర్పంచ్ ప్రవీణ్ నాయక్ అభినందించారు.గ్రామంలో సోదరభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు మరిన్ని జరిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు,గ్రామ పెద్దలు,ముస్లిం సోదరులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడులు.




**బయ్యారం/మార్చి 16.(జర్నలిస్ట్ వార్త);**
మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బయ్యారం మండలంలోని కొత్తపేట,గంధంపల్లి గ్రామాలలో సోమవారం ఎక్సైజ్ ఎస్ఐ జి.మౌనిక ఆధ్వర్యంలో గుడుంబా అమ్మకం దారులపై దాడులు నిర్వహించి గుడుంబా అమ్ముతున్న నలుగురు ముద్దాయిల నుండి (08) లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, గుడుంబా అమ్ముతున్న పసుపులేటి సరోజన,శీలం రజిత,ఓట్టెం రాంబాయి,బానోత్ పద్మ వారిపై కేసు నమోదు చేసి,వారిని బయ్యారం తహశీల్దార్ నాగరాజు ముందు బైండోవర్ చేశారు.ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మధు,కానిస్టేబుళ్లు శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామలయాన్ని ఎండోమెంట్ పరిధిలో తీసుకోవాలని అధికారులకు సర్పంచ్ ప్రవీణ్ నాయక్ వినతి.

**బయ్యారం/మార్చి 16.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం గంధంపల్లికొత్తపేట గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన రామాలయ అభివృద్ధి కోసం సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులను కలిసి ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య ఇచ్చిన సిఫారసులేటర్ ను వారికి అందించారు.ఈ సందర్భంగా అధికారులతో ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఆలయాన్ని ఎండోమెంట్ శాఖ పరిధిలోకి తీసుకుని సెక్షన్ 43 రిజర్వేషన్ చేయించి, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అధికారులను కోరారు.ఈ అంశంపై స్పందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్,ఇన్స్పెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేయించి ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామంలోని పురాతన రామాలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అన్ని వసతులు కల్పించాలనే సంకల్పంతో కృషి చేస్తున్న సర్పంచ్ ను గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు.



## నూతన తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ డొంకెన స్వప్న

**.సన్మానించిన మాజీ మార్కెట్ చైర్పర్సన్ అక్కెనె పెల్లి స్వర్ణలత బాలరాజు**



**స్టేషన్ ఘన్పూర్ /మార్చి 16 (జర్నలిస్ట్ వార్త) :**
స్టేషన్ఘన్పూర్ తాహసిల్దార్ గా డొంకెన స్వప్న సోమవారం రోజున మండల తాహసిల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగు చ్ఛం ఉత్సవం అందజేసి స్వాగతించారు. ఇటీవల బదిలీపైవచ్చిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జిల్లాలోని తహసీదారులను బదిలీ చేసిన క్రమంలో ఇక్కడ పని చేసిన తాసిల్దార్ వెంకటేశ్వర్లు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయగా, కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డి స్వప్న ను ఘన్పూర్ తాహ సిల్దార్ కార్యాలయానికి తాహసిల్దార్ గా బది లీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం తాహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన డొంకెనా స్వప్న మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షే మ పథకాలు అన్ని అర్హులైన లబ్ధిదారులకు అందెల గుర్తు చేస్తానని , ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ డొంకెన స్వప్నను మాజీ మార్కెట్ చైర్మన్ అక్కెనపల్లి స్వర్ణలత బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ప్రాణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానభాగ మనోహర్, లునావత్ జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం డైరీ ఆవిష్కరణ

**వరంగల్ డీఈఓ రంగయ్య నాయుడు**



**వరంగల్/మార్చి 16(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రూపొందించిన ప్రత్యేక డైరీని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి రవి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల రోజువారీ విధుల్లో ఉపయోగపడేలా అకాడమిక్ అంశాలతో ఈ డైరీని రూపొందించడం అభినందనీయమన్నారు
సాంఘిక శాస్త్రానికి సంబంధించిన చారిత్రక, భౌగోళిక ప్రాముఖ్యత గల రోజులు. టీచింగ్ డైరీ: బోధనలో ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉండేలా వినూత్నంగా తీర్చిదిద్దారు. జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్ మాట్లాడుతూ, ఈ డైరీని జిల్లావ్యాప్తంగా 200 మందికి, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,000 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఫోరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్ తేజ, ఫోరం గౌరవ అధ్యక్షుడు మంగ రాజన్న, కార్యదర్శులు చిట్టిపోతుల సంపత్, రాజనాల సురేష్, ఆర్థిక కార్యదర్శి ఆమంచ రవికుమార్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, అన్న మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో యాంత్రీకరణతోనే లాభాలు

**: డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్**



**సత్తుపల్లి/ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు యాంత్రీకరణ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు.సోమవారం సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం 202526 కింద రాయితీ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రోటావేటర్లు, బేలర్లు, స్ప్రేయర్లు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా లేక పెట్టుబడి భారంగా మారుతోందన్నారు. రైతులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో సాంకేతికత, యాంత్రీకరణకు ప్రాధాన్యం పెరుగుతోందని, రైతులు ఆధునిక పద్ధతులను స్వీకరించి ఉత్పాదకత పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, సత్తుపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్ప రెడ్డి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు




# దళిత సమస్యలపై గళమెత్తేందుకు మహాసభ

**మైస ఉపేందర్ మాదిగ పిలుపు**



**ధర్మసాగర్/హనుమకొండ హీరో, మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న హన్మకొండలో నిర్వహించనున్న దళిత మహాసభను భారీ స్థాయిలో విజయవంతం చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం హన్మకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ మహాసభ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దళితులకు న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ ఆ ఆశలు నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో ఆశించిన స్థాయిలో మార్పులు కనిపించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చే ప్రతి ప్రభుత్వం దళితుల అభివృద్ధి పేరుతో హామీలు ఇస్తున్నప్పటికీ వాటి అమలులో మాత్రం విఫలమవుతోందని విమర్శించారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితుల అభివృద్ధి కోసం పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసం చేసిన రాజకీయ వాగ్దానాలుగానే మిగిలిపోయాయని అన్నారు.దళిత సంక్షేమం పేరుతో ప్రకటించే పథకాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. పథకాల అమలులో పారదర్శకత లేకపోవడం వల్ల అర్హులైన దళిత కుటుంబాలకు ప్రయోజనం చేరడం లేదని తెలిపారు. దళితులకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగం కాకపోవడం కూడా ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు.రాష్ట్రంలో ఎస్సీలకు జనాభా దామాషా ప్రకారం కనీసం 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దళితుల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం స్పష్టమైన విధానాలు రూపొందించాలని కోరారు. ముఖ్యంగా దళిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక ప్రణాళికలు తీసుకురావాలని సూచించారు.దళితుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా విభజించి తక్షణమే చైర్మన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు అందాల్సిన పథకాలు, రుణాలు, ఆర్థిక సహాయం సరైన విధంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత సంక్షేమానికి కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు “అంబేద్కర్ అభయహస్తం” పేరిట ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక పథకాన్ని ప్రకటించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా దళిత కుటుంబాలు స్వయం ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు.రాష్ట్రంలో ఇంకా అనేక ప్రాంతాల్లో దళితులు సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దళితుల గౌరవం, హక్కులు, సామాజిక న్యాయం కోసం సమాజం మొత్తం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో మార్చి 18న హన్మకొండలో నిర్వహించనున్న దళిత మహాసభకు రాష్ట్రంలోని మాదిగలు, దళిత సంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభ దళితుల ఐక్యతకు, హక్కుల సాధనకు కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో వేల్పుల రామ్‌కుమార్, మాతంగి సంతోష్, మంద రాకేష్, వేల్పుల నవీన్, వేల్పుల కిరణ్, ధృవకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణగిరి రైతు వేదికలో వ్యవసాయ శాఖ సమావేశం

**నానో ఎరువుల వినియోగంఎఫ్‌పీవో బలోపేతంపై అవగాహన**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామంలో గల రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఉపయోగపడే పలు కీలక వ్యవసాయ అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నానో ఎరువుల వినియోగంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. నానో ఎరువుల వాడకం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు సమర్థవంతంగా అందడంతో పాటు ఎరువుల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదేవిధంగా రైతులు మరియు వ్యవసాయ విస్తరణ సిబ్బందికి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలని నిర్ణయించారు. రైతులు సమూహంగా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు) బలోపేతం చేసుకోవడం ద్వారా ఉత్పత్తుల మార్కెటింగ్, విలువ వృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదాయం పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు.పంటల సాగులో నేల ఆరోగ్యం పరిరక్షణ, నీటి నిర్వహణ, పురుగుల నియంత్రణ వంటి సాంస్కృతిక పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి పాలకుర్తి రాజేష్, కేవీకే శాస్త్రవేత్త విశ్వతేజ, విస్తరణ అధికారులు జి. హరీష్, బిందు, గ్రామ సర్పంచ్ పుట్ట రేణుకతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



# అంగన్వాడీ టీచర్ల అరెస్టులను ఖండించిన సహచరులు

## హక్కులు సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తాం

**ఎల్కతుర్తి/ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీ టీచర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అంగన్వాడీ టీచర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న గౌరవ వేతనాన్ని రూ.18 వేల నుండి రూ.26 వేల వరకు పెంచడంతో పాటు ఇతర ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు వెళ్తున్న సమయంలో స్థానిక పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా




నాయకురాలు కునుకుంట్ల రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందికి పనికి తగ్గ వేతనం, ఇతర సౌకర్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.2 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో ఉదయం అరెస్టు చేయడం పోలీసుల వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. పోలీసులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని, అంగన్వాడీ హక్కుల సాధన కోసం ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. అంగన్వాడీలను చిన్నచూపు చూస్తే ప్రభుత్వాలు కూడా పతనం అయిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు రమాదేవితో పాటు మండల నాయకులు ఉమా, విజయ, శోభారాణి, మనోహర, సరోజన, నిర్మల, శ్రీలత, సరిత, మేకల సరిత తదితరులు పాల్గొన్నారు.

# దళితుల సమస్యలపై ఉద్యమిస్తాం

### నిమ్మల మనోహర్, రెంటాల దేవా

**ఎల్కతుర్తి/ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** దళితుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు నిమ్మల మనోహర్, రెంటాల దేవా తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచినా దళితుల సమస్యలు పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో 20 శాతం నిధులను దళితులకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, కేటాయించిన నిధులను కోతలు పెట్టి ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు.

ఈ సమస్యలపై దళితులు ఎన్నోసార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి కలెక్టర్లకు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు.



ప్రైవేటీకరణను నిలిపివేసి ప్రైవేట్ రంగాల్లో కూడా దళితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు సబ్సిడీ నిధులను విడుదల చేయాలని, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అంటరానితనాన్ని తక్షణమే అరికట్టాలని కోరారు. భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విద్యా హక్కు, భూమి హక్కు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా మేనిఫెస్టోలో పేర్కొన్న అంబేద్కర్ హస్తం పథకం కింద దళితులకు రూ.12 లక్షల మంజూరు విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించలేదని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు ఇవ్వకుండా విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ప్రభుత్వము వెంటనే జోక్యం చేసుకుని వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, ధర్మసాగర్ మండల కార్యదర్శి రాజారపు రత్నం తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

# గగనశ్రీకి సత్కారం

## విశ్వశాంతి విద్యాలయంలో అభినందనలు





**సత్తుపల్లి/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్17 విభాగంలో నాలుగో స్థానం సాధించిన యువ క్రీడాకారిణి కొలపనేని గగనశ్రీకి సోమవారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో ఘన సత్కారం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో విశ్వశాంతి విద్యాలయంలో పదో తరగతి పూర్తి చేసిన గగనశ్రీ తన పాఠశాలను సందర్శించగా, విద్యాలయ ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గగనశ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్17 విభాగంలో సింగిల్స్ మరియు మిక్స్ డబుల్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఆ విజయంతో ఒడిశాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి ఆల్ ఇండియా స్థాయిలో నాలుగో స్థానం సాధించడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో నిత్యం సాధన కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గగనశ్రీ తండ్రి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్ విందు

## అదనపు కలెక్టర్ వైవీ గణేష్ -ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లింలకు సామూహిక విందు





**వర్ధన్నపేట/మార్చి16 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని కట్ర్యాల గ్రామ శివారులో గల ఒక వేడుకల మందిరంలో సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా అదనపు కలెక్టర్ వైవీ గణేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలిచే రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని చాటిచెప్పేలా ప్రభుత్వం ప్రతి ఏటా ఈ విందును ఏర్పాటు చేస్తోందని తెలిపారు.



నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన ముస్లిం సోదరులు ఈ విందులో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దల ప్రత్యేక ప్రార్థనలు, నమాజులతో కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉపవాస దీక్షలు విరమించిన అనంతరం అందరూ కలిసి సామూహికంగా విందులో పాల్గొన్నారు. లోక కల్యాణం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం మత పెద్దలు ఈ సందర్భంగా దువా చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తహశీల్దార్ విజయసాగర్, పర్వతగిరి తహశీల్దార్ వెంకటస్వామి, ఐనవోలు తహశీల్దార్ కిరణ్, ఇతర రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజారాం ఎన్నిక

**ఎల్కతుర్తి/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు, సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా కాదరి రాజారాం ను పార్టీ కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గ్రామ శాఖ యువజన అధ్యక్షుడిగా కాదరి మురళిని



ఎంపిక చేసినట్లు గ్రామ టీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాజారాం, మురళి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులు, కార్యకర్తల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. కమిటీలో ఉపాధ్యక్షుడిగా సాతూరి ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా సందేల నరేష్, సభ్యులుగా రాజమౌళి, నరిగె రవీందర్, నక్క రాకేష్ తదితరులు ఉన్నారు.

# తల్లాడ మండల గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**తల్లాడ/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) మండల కమిటీని సోమవారం తల్లాడ గ్రామంలో గౌడ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన గౌడ సంఘ ప్రతినిధులు సమావేశమై కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులుగా గుండ్ల నాగేశ్వరరావు గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గుండ్ల వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మొక్క కృష్ణార్జున గౌడ్, కార్యదర్శులుగా బొడ్డు సత్యం గౌడ్, అధికార ప్రతినిధిగా



నాశగాని సురేష్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బొడ్డు వెంకటేశ్వర్లు గౌడ్, సమ్మెట రామకృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొడ్డు శ్రీను గౌడ్‌లను ఎంపిక చేశారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు తల్లాడ గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు గౌడ్, ఖమ్మం జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) జిల్లా అధ్యక్షులు బండి నాగేశ్వరరావు గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దావా ముత్యాలరావు గౌడ్, కొనిజర్ల మండల అధ్యక్షులు పెద్దప్రోలు నాగేశ్వరరావు గౌడ్, మోకుదెబ్బ నాయకులు బొమ్మగాని హనుమంతరావు గౌడ్‌లు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లాడ గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ తల్లాడ మండలంలోని గౌడ సోదరులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అందరూ ఐక్యంగా ఉండి పార్టీలకు అతీతంగా తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా మోకుదెబ్బ అధ్యక్షులు బండి నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ గౌడ జాతి హక్కుల పరిరక్షణ కోసం నూతన కమిటీ కృషి చేయాలని కోరారు. గీత వృత్తిలో ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి గౌడలకు అవసరమైన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అంగన్వాడీలతో తల్లిబిడ్డల ఆరోగ్య సంరక్షణ

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక




**నర్సంపేట/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మున్సిపల్ పరిధిలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో మధురిమ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలు తల్లిబిడ్డలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నేటి పిల్లల ఆరోగ్యమే రేపటి భావితరానికి పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే వారధులుగా అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. వైస్ చైర్మన్ గంధం నరేందర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో మున్సిపాలిటీ తరపున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరామోజు రోజారాణి, పొన్నం నరసింహారెడ్డి, ప్రాజెక్టు సూపర్వైజర్లు రమ, అరుణ, పారిజాతం, రాధ, హేమలత, నజ్మా, విజయరాణి, భాగ్యమ్మ, వాసంతి, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లాభారతి, ప్రాజెక్టు అధ్యక్షురాలు గొర్రె రాధ, ప్రధాన కార్యదర్శి బత్తిని శిరీష, మండల అధ్యక్షురాలు రమతో పాటు మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

## తల్లాడ మండల ఆరోగ్య కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

**తల్లాడ/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తల్లాడ మండల ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర




పోషిస్తున్నప్పటికీ వారికి సరైన వేతనాలు, సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతో పాటు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ జీతం ఇవ్వాలని, ఆశా వర్కర్ల ఉద్యోగాలను శాశ్వతం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సెలవు రోజులలో కూడా పనులు అప్పగిస్తూ తగిన వేతనం ఇవ్వడం లేదని, పనిభారాన్ని తగ్గించి వారికి తగిన గుర్తింపు కల్పించాలని కోరారు. విధులు నిర్వహించే సమయంలో మంచినీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలు, వివిధ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆశా వర్కర్లను విస్తృతంగా వినియోగిస్తున్నప్పటికీ తగిన జీతభత్యాలు ఇవ్వడం లేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో "చలో హైదరాబాద్" కార్యక్రమానికి పిలుపునిస్తూ అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. రెండు రోజుల సమ్మె చేపట్టనున్నట్లు వైద్యాధికారికి సమ్మె నోటీసు కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు టి.రాణి, జి.దేవకరణ, పి.నాగమణి, జె.శాంతమ్మ, బి.శ్యామల, పి.సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి

## ఈద్గా అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**నర్సంపేట /మార్చి 16 (జర్నలిస్టు వార్త):**
నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి నాయకత్వంలోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు శివారులో గల ఈద్గా మైదానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ ప్రార్థనల కోసం సుమారు రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం ద్వారా మురికి, గడ్డి వంటి ఇబ్బందులు లేకుండా భక్తులు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకోవచ్చని, ఇది వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఈద్గా మైదానంలో భక్తుల సౌకర్యార్థం నీటి వసతి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలను సుందరీకరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీరామోజు రోజారాణి, ఎండి అయూబ్ ఖాన్, ముత్తినేని వెంకన్న, మాతృ రాథోడ్, ఏవూరి శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల నరసింహ, మస్జిద్ అధ్యక్షులు మసూద్ అలీ బేగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవోజు సదానందం, లక్కర్స్ రమేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# కటక్ ఆస్పత్రిలో దారుణం

## ఐసియులో చెలరేగిన మంటలు

## పదిమంది రోగుల దుర్మరణం





**భువనేశ్వర్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):** ఒడిషాలోని కటక్ ఆస్పత్రి ఐసీయూలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా కాలిన గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీ లోగల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కటక్‌లోని ఎస్‌సీబీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ట్రామా కేర్ విభాగం ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ తెల్లవారుజామున 2.30 నుంచి 3.00 గంటల మధ్య సమయంలో ప్రమాదం జరిగిందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. మంటలు చెలరేగగానే తాము రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఘటన సమయంలో ఐసీయూలో ఆ పక్కన ఉన్న వార్డులో మొత్తం 23 మంది రోగులు చికిత్స పొందుతున్నారని, వారిని తరలిస్తుండగా అప్పటికే ఏడుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారని, మరో ముగ్గురు తరలించే క్రమంలో మృతిచెందారిని ఐసీయూ సిబ్బంది వెల్లడించారు. ఐసీయూ నుంచి రోగులను తరలించే క్రమంలో సిబ్బందిలో కూడా 11 మంది గాయపడ్డారని తెలిపారు.

# ప్రాణాలు తీసిన చేపల వేట

## మూసీలో మునిగి ముగ్గురు యువకులు మృతి

**హైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
చేపల వేటకు వెళ్లి.. ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన గండిపేట జలాశయం దిగువున ఉన్న మూసి నది పరివాహక ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు, రెస్క్యూ టీం నదిలో గాలించి వారి మృతదేహాలను సోమవారం ఉదయం ఒడ్డుకు తీసుకువచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేష్ (25)లు ఆదివారం మూసి నది పరివాహక ప్రాంతంలో చేపల వేటకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో.. వారు నదిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే రెస్క్యూ టీమ్‌ను సైతం అక్కడికి రప్పించారు. సాయంత్రం నుంచి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ముగ్గురు ఒకే కాలనీ వాసులు కావడంతోపాటు స్నేహితులని మృతుల బంధువులు తెలిపారు. మృతుల కుటుంబాలు గాంధీ ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.
-----------

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వృద్ధురాలు

## నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ ఫోటోలతో మోసం

## ఏకంగా రూ. 87.96 లక్షలు కొట్టేసిన మోసగాళ్లు

**హైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో ప్రజల వద్ద నుండి డబ్బులు లాగేస్తున్నారు. తాజాగా దేశ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫోటోలు, వీడియోలనే వాడుకుంటూ కేటుగాళ్లు రెచ్చిపోయారు. డీప్ ఫేక్ సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియోను చూసి నిజమని నమ్మిన ఓ వృద్ధురాలు ఏకంగా రూ. 87.96 లక్షలు పోగొట్టుకున్న ఘటన మల్కాజిగిరిలో వెలుగుచూసింది. అసలేం జరిగిందన్న విషయానికి వెళితే.. బాధిత వృద్ధురాలు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుండగా, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి వివరిస్తున్నట్లు ఉన్న ఒక వీడియో ఆమె కంటపడింది. అది ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో అని తెలియని ఆమె, సాక్షాత్తు మంత్రి గారే చెబుతున్నారు కదా అని నమ్మి ఆ వీడియో లింక్‌ను క్లిక్ చేశారు. లింక్ క్లిక్ చేసిన వెంటనే సైబర్ కేటుగాళ్లు రంగంలోకి దిగారు. బాధితురాలికి వాట్సాప్ కాల్స్ చేసి తాము పెద్ద ట్రేడింగ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 'ట్రేడ్ యాప్' అనే ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇందుకోసం ఆమె ఐడీ ప్రూఫ్స్, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకుని, ఒక యూజర్ ఐడీ, పాస్వర్డ్ క్రియేట్ చేసి ఇచ్చారు. ఇక అంతే వారి అసలైన ప్లాన్ అమలు చేశారు. మొదట నమ్మకం కలిగించడానికి కేవలం రూ. 60 వేలు ఇన్వెస్ట్ చేయించారు. ఆ తర్వాత లాభాలు వస్తున్నట్లు నకిలీ గ్రాఫిక్స్ తో స్క్రీన్ పై చూపించి.. దఫదఫాలుగా మొత్తం రూ. 87.96 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు. తన అకౌంట్‌లో భారీగా డబ్బు కనిపిస్తుండటంతో, బాధితురాలు ఆ మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించారు. అయితే సాంకేతిక కారణాలు చెప్తూ కేటుగాళ్లు ఆమెను అడ్డుకున్నారు. ఎంత ప్రయత్నించినా డబ్బు చేతికి రాకపోవడంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇక బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ డబ్బు ఏ అకౌంట్ల లోకి వెళ్లిందో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అనుమానాస్పద లింక్స్ లేదా కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సెమినార్‌కు సర్వం సిద్ధం

## ప్రొఫెసర్ మల్లం నవీన్

**నర్సంపేట/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో మంగళవారం నిర్వహించనున్న "రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ప్లాంట్ సైన్స్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఇన్ క్రాప్ ఇంప్రూవ్‌మెంట్" అంశంపై జాతీయ సెమినార్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు.
ఈ సెమినార్‌కు రూసా నుంచి స్పాన్సర్‌షిప్ లభించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. సెమినార్ కోసం కళాశాలలో సభా వేదిక, అతిథుల స్వాగత ఏర్పాట్లు, పాల్గొనే అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు తెలిపారు.



ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ సదస్సుకు చీఫ్ పేట్రన్‌గా కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఆర్జేడీ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్, ఆర్జేడీ జోన్2 బాలభాస్కర్, రూసా డైరెక్టర్ సౌందర్య జోసెఫ్ హాజరుకానున్నారని తెలిపారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. సదస్సులో మూడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ ఉపన్యాసకులు, శాస్త్రవేత్తలు పాల్గొననున్నారని, వందకు పైగా పరిశోధన పత్రాలు సమర్పణకు వచ్చాయని తెలిపారు. ఈ సెమినార్ శాస్త్రీయ చర్చలకు వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెమినార్ నిర్వహణ కార్యదర్శి డా. రాంబాబు మాట్లాడుతూ జాతీయ సెమినార్ విజయవంతం కావడానికి అన్ని కమిటీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు మార్గదర్శకాలను పాటిస్తూ సమయానికి హాజరుకావాలని కోరారు.
కళాశాల అధ్యాపకులు, నిర్వాహక బృందం, సిబ్బంది సహకారంతో సెమినార్ విజయవంతం అవుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎపిలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం

**గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు**

**అర గంట ముందుగానే లోపలికి అనుమతి**

**క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి**

**విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్**

**అమరావతి,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
ఎపిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నాడు ప్రారంభం అయ్యాయి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో గంట ముందుగానే విద్యార్దులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్దులను వారి తల్లి తండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు వెంట వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. బస్సులో, ఆటోల్లో, బైక్ లు మీద తల్లి తండ్రులు, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్దులను పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు హాల్ టికెట్స్ నెంబర్ ఆధారంగా రూం కేటాయింపు చూసుకున్నారు. అనంతరం ఆరగంట ముందు విద్యార్దులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్దులు దగ్గర ఎటువంటి



ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయా అనేది చెక్ చేసి పరిశీలించి లోపలికి పంపించారు. బాలురకు పురుషులు, బాలికలకు స్త్రీ సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల హాల్ టికెట్ చూపించి, ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు ఉచితంగా చేరుకోవచ్చు. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు వెంట వచ్చిన తల్లి తండ్రులు,ఉపాద్యాయులు స్నేహితులు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ వారికి దైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతంగా ఉండండి అంటూ విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. ఈ పరీక్షల్లో 100 శాతం మీ ప్రతిభను ప్రదర్శించే సమయం ఇదని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాయండంటూ వారికి ఆయన స్పష్టం చేశారు. విజయం మీదే. ఆల్ ది బెస్ట్ అంటూ వారికి మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా 10వ తరగతి విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు.

# మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ

## 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

## ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు


## బిఎసి సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్,మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల



నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.
--------

# ముస్లింల సంక్షేమమే మా లక్ష్యం



## విజయవాడలో ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం చంద్రబాబు...

**ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి**

**వక్ఫ్ ఆస్తులను కాపాడతామని,**

**ముస్లింల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ**

**గత 21 నెలల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించిన చంద్రబాబు**

**విజయవాడ మార్చి 16 (జర్నలిస్ట్ వార్త):**
విజయవాడలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన గొప్ప సూక్తి అని, మహ్మద్ ప్రవక్త బోధనలను స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అందించామని చంద్రబాబు వివరించారు. ఎన్టీఆర్ భరోసా కింద 4.38 లక్షల మంది ముస్లింలకు ఏటా



రూ.3,511 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, 4.5 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' అందిస్తున్నామని, 19,215 మందికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కింద రూ.240 కోట్లు, దీపం పథకం ద్వారా 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు అందించామని చెప్పారు.
ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని రూ.5 వేలు, రూ.10 వేలకు పెంచి రూ.180 కోట్లు అందించామని, బకాయిలుగా ఉన్న రూ.45 కోట్లను కూడా విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించనున్నామని, వివాహ లైసెన్స్ గడువును 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచుతున్నామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచే 347 మంది హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తిచేశామని గుర్తుచేశారు. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి, బోర్డుకు ఎన్నికలు నిర్వహించిందని, సుమారు 1500 వక్ఫ్ ఆస్తులపై సర్వే పూర్తి చేశామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ఫలాలను ముస్లింల సంక్షేమానికే వినియోగిస్తామని భరోసా ఇచ్చారు. నూర్ బాషా ఫెడరేషన్‌ను దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,434 కోట్ల నుంచి ఈసారి రూ.6,090 కోట్లకు పెంచామని వెల్లడించారు.